శ్రీ సుబ్రహ్మణ్య పంచ రత్న స్తోత్రమ్ - భావార్థముతో.



సేకరణ: కిరణ్ టైప్ ఇనిస్టిట్యూట్, 41-1/8-13A.,
గౌతమీనగర్,3వ లైను, కృష్ణలంక, విజయవాడ-520 013.
https://madhirafamily.wordpress.com/

శ్రీ సుబ్రహ్మణ్య పంచ రత్న స్తోత్రమ్ - భావార్థముతో.

01. షడాననం చందన లేపితాంగం
మహోరసం దివ్య మయూర వాహనమ్।
రుద్రస్య సూనుం సురలోకనాథం
బ్రహ్మణ్యదేవం శరణం ప్రపద్యే॥

ఆరు ముఖములు కలవాడు, శరీరముపై చందనమును ధరించువాడు, రసస్వరూపుడు, నెమలి వాహనము కలవాడు, శివుని తనయుడు, దేవలోకాలకు అధిపతియైన పరబ్రహ్మ స్వరూపునకు ప్రణమిల్లుతూ శరణు వేడుతున్నాను.

ఆరు ముఖములు కలిగి, శరీరమంతా గంధపు పూతలతో అలంకరింపబడినవాడై, వేద పాఠము తానై, మయూర వాహనుడై, శివ కుమారుడై, దేవ లోకమునకు అధిపతియై, పరబ్రహ్మ స్వరూపుడైన శ్రీ కుమార స్వామిని శరణు వేడుతున్నాను.

02. జాజ్వల్య మానం సురవృందవంద్యం
కుమార ధారాతట మందిరస్థమ్।
కందర్ప రూపం కమనీయ గాత్రం
బ్రహ్మణ్యదేవం శరణం ప్రపద్యే॥

దేదీప్యమానంగా భాసిల్లువాడు, సురలచే కొలువబడువాడు, కుమారధర నదీతీరమున ఆలయంలో వెలసినవాడు, ఆకర్షణీయమైన రూపముకలవాడు అయిన పరబ్రహ్మ స్వరూపునకు ప్రణమిల్లుతూ శరణు వేడుతున్నాను.

ఈ సమస్త విశ్వములోను జాజ్వల్యమానముగా ప్రకాశిస్తూ, ఇంద్రాది దేవతలందరిచే స్తుతించబడుతూ, కుమారధారా నదీ తీరములో ఉన్న మందిరములో ప్రతిష్ఠితుడై, మనోహరమైన లక్షణములు కలవాడు బహు సుందరమైన రూపము కలవాడు, పరబ్రహ్మ స్వరూపుడైన శ్రీ కుమార స్వామిని శరణు వేడుతున్నాను.

03. ద్విషడ్భుజం ద్వాదశ దివ్యనేత్రం
త్రయీతనుం శూలమసీ దధానమ్।
శేషావతారం కమనీయ రూపం
బ్రహ్మణ్యదేవం శరణం ప్రపద్యే॥

ఆరు జతల చేతులు కలవాడు, ద్వాదశ పవిత్ర నేత్రాలు కలవాడు, త్రినేత్రుని తనయుడు, శూలమును ఆయుధముగా ధరించువాడు, శేషుని అవతారం, చూడముచ్చటైన రూపంకల పరబ్రహ్మ స్వరూపునకు ప్రణమిల్లుతూ శరణు వేడుతున్నాను.

పన్నెండు భుజములు కలవాడై, పన్నెండు ఆకర్షణీయమైన నేత్రములు కలవాడై, త్రినేత్రుడైన ఈశ్వరుని కుమారుడై, శివునిచే త్రిశూలము బహూకరించబడినవాడై, శేషుని యొక్క ప్రతిరూపమై, సుందరమైన దృక్కులు కలవాడు, పరబ్రహ్మ స్వరూపుడైన శ్రీ కుమార స్వామిని శరణు వేడుతున్నాను.

04. సురారి ఘోరాహవ శోభమానం
సురోత్తమం శక్తిధరం కుమారమ్।

సుధార శక్త్యాయుధ శోభిహస్తం
బ్రహ్మణ్యదేవం శరణం ప్రపద్యే॥

సురారి, దేవతల శత్రువులకు భయము కలిగించే తేజస్సు కలవాడు, దేవతలలో ఉత్తముడు, పార్వతీదేవి తనయుడు, చేతిలోని శక్తితో తేజరిల్లు పరబ్రహ్మ స్వరూపునకు ప్రణమిల్లుతూ శరణు వేడుతున్నాను.

దేవతల శత్రువులైన అసురులకు భయంకరుడై, దేవతలందరిలోనూ అధికుడై, ఆది పరాశక్తికి పుత్రుడుగా అలరారువాడై, తన చేతిలో శక్తి ఆయుధము కలిగి ప్రకాశించువాడు, పరబ్రహ్మ స్వరూపుడైన శ్రీ కుమార స్వామిని శరణు వేడుతున్నాను.

05. ఇష్టార్థసిద్ధి ప్రదమీశ పుత్రమ్
ఇష్టాన్నదం భూసుర కామధేనుమ్।
గంగోద్భవం సర్వ జనానుకూలం
బ్రహ్మణ్యదేవం శరణం ప్రపద్యే॥

అడిగిన వరములిచ్చు శివుని కుమారుడు, విప్రులకు అన్ని కోరికలు తీర్చు కామధేనువు, గంగనుండి ఆవిర్భవించి అందరికీ చేయూతనిచ్చే పరబ్రహ్మ స్వరూపునకు ప్రణమిల్లుతూ శరణు వేడుతున్నాను.

ఈశ్వర పుత్రుడై, సర్వార్థ కామములను ప్రసాదించువాడై, ఆహార ప్రదాతయై, కోరిన కోరికలను తీర్చు కామధేనువుగా, గంగానదినుండి ఉద్భవించి సర్వజనులను చల్లగా చూచువాడై, పరబ్రహ్మ స్వరూపుడైన శ్రీ కుమార స్వామిని శరణు వేడుతున్నాను.

కిరణ్ టైప్ ఇన్స్టిట్యూట్

06. యః శ్లోక పంచమిదం పఠతీహ భక్త్యా
బ్రహ్మణ్యదేవ వినివేశిత మానసః సన్।
ప్రాప్నోతి భోగమఖిలం భువి యద్యదిష్టమ్
అంతే స గచ్ఛతి ముదా గుహసామ్యమేవ॥

ఈ ఐదు చరణములు భక్తితో పఠించువారు, తాను పరబ్రహ్మ స్వరూపం అన్న సత్యాన్ని తెలుసుకొన్నవారు తమ అవనీ సంచారంలో అన్ని సుఖములను అనుభవిస్తారు. కడకు సుబ్రహ్మణ్యస్వామి దివ్య పాదాలను చేరుకొంటారు.

ఎవరు పంచరత్నములనే ఈ అయిదు శ్లోకములను, భక్తి శ్రద్ధలతో, మనసునిండా సుబ్రహ్మణ్యుని నింపుకుని, నిత్యం పఠిస్తారో, వారు జీవించి ఉన్నంత కాలము సకల సంపదలను అనుభవించి, అంత్యమున శ్రీ సుబ్రహ్మణ్య సాన్నిధ్యాన్ని తప్పక పొందుతారు.

// ఇతి శ్రీ సుబ్రహ్మణ్య పంచరత్న స్తోత్రమ్ సంపూర్ణమ్ //

- - - = - - -





Kiron Type Institute

కిరణ్ టైప్ ఇన్స్టిట్యూట్



(ఎక్కడైనా తప్పులు ఉంటే సహృదయంతో తెలియజేయవలసినదిగా మనవి. -944 044 9650, 994 994 1430)